మినీ కథ:

# దికిడ్నాప్

ఓ.ఆర్.కె.రావ్



"నేనండి లక్ష్మిని మాట్లాడుతున్నాను."

"నీకెన్నిసార్లు చెప్పాలి ఆఫీసులో వున్నప్పుడు ఫోన్ చేసి డిస్టర్బ్ చెయ్యవద్దని- ఇంతకీ ఏమిటి అంత కొంపమునిగిపోయే విశేషం" రావు విసుక్కున్నాడు. బోర్డు మీటింగ్ జరుగుతూంటే స్టెనో పంపిన నోట్ చదువుకుని ఫోన్ ఆన్సర్ చెయ్యడానికి పైకి వచ్చాడు రావు.

"మూడు గంటలకి స్కూలు నుంచి రావలసిన నానిగాడు యింకా రాలేదు. స్కూలు బస్సు కూడా వచ్చి ఎప్పుడో వెళ్ళిపోయింది. స్కూలుకి ఫోన్ చేస్తే ఎవరూ ఫోన్ ఎత్తడం లేదు. అయిదు గంటలైనా రాకపోతే భయం వేసి ఫోన్ చేశాను. మీ ఆఫీసులో ఎవరినైనా స్కూలికి పంపించి. సంగతేమిటో కనుక్కురమ్మనండి వాడు టైముకి రాకపోతే నా మనసు పరిపరి విధాల పోతుంది. ఉదయం స్కూలుకి వెళ్ళనని మారాం చేశాడు అసలు లేవడమే ఆలశ్యంగా లేచాడు ఎలాగో బ్రతిమాలి చాక్లెట్లు యిచ్చి స్కూలుబస్సు ఎక్కించేసరికి నా తాతలు దిగివచ్చేరు. రోజులా బస్సు కదిలేముందు 'టాటామమ్మీ' అని కూడా చెప్పలేదు. ఎవరైనా నానిని కిడ్నాప్ చేశారో ఏమో. దిగులుగా వుంది.

పాపిష్టిదాన్ని నేనే బలవంతంగా యివాళ స్కూలికి పంపించేను. పసి వెధవ నాలుగు సంవత్సరాలైనా నిండని చిట్టి నాగమ్మని యిప్పటినుంచీ స్కూల్లో చేర్పవద్దని నెత్తీ నోరూ కొట్టుకున్నా. విన్నారు కాదు. ఎక్కడ తప్పిపోయాడో ఏమో" అని ఏడుస్తున్నలక్ష్మి గొంతుకు వినేసరికి రావుకి ఎక్కడలేనికోపం వచ్చింది. "సరేలే నువ్వు రెడీగా వుండు పది నిమిషాల్లో యింటికి వస్తాను. ఇద్దరం కలిసి వెతకడానికి వెళ్దాము. అన్నిటికి నువ్వు కంగారుపడి నన్ను కంగారు పెట్టకు" అని రావు కార్లో యింటికి బయల్దేరాడు. గుమ్మంలో అడుగుపెట్టిన రావుని కౌగలించుకుని భోరున ఏడ్చింది లక్ష్మి ఇద్దరూ కార్లో బయలుదేరి స్కూలుకి వెళ్ళేరు. వాచ్‌మన్‌ని పిలిచి నాని గురించి అడిగారు. నానిని చూడలేదన్నాడు వాచ్‌మన్. వాచ్‌మన్‌ని క్లాసు రూమ్ తలుపులు తెరవమన్నాడు రావు. క్లాసు రూమ్‌లో నాని లేకపోవడం చూసేసరికి రావుకి కూడా బెంగ పట్టుకుంది. ఏం చెయ్యడమా అని ఆలోచిస్తూంటే లక్ష్మి పోలీస్ కంప్లైంట్ యిస్తే బాగుంటుందేమో అంది.

స్కూలు వెనకనున్న పార్కులోంచి నడిచి వస్తున్న వారిద్దరికీ చెట్టు క్రింద వాటర్ బాటిల్ కనిపించింది. వాచ్‌మన్ చేతిలోని టార్చిలైటు తీసుకుని చెట్టు క్రిందకి ఫోకస్ చేశాడు రావు. హాయిగా నోట్లో వేలు పెట్టుకుని నిద్రపోతున్న నాని కనిపించాడు.

లక్ష్మి వెళ్ళి భుజాన వేసుకునే వరకూ తెలివి రాలేదు. నానికి "మమ్మీ.డాడీ" అని అమ్మ మెడను గట్టిగా చేతుల్తో చుట్టి పట్టుకున్నాడు నాని. ●

